క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గొర్లిపేటలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఓ ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు..ఎస్‌ఐ గణేష్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని, ముగ్గురు జూదరులను పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని, విషయం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు గ్రామస్తులకు తెలిపారు.

వాహనం కండిషన్ చెక్ చేసుకోవాలి



104 వాహనం కండిషన్ తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ విలియమ్ చంద్

విజయనగరం ఫోర్ట్: ప్రతిరోజూ 104 వాహనాల కండిషన్ చెక్ చేసుకోవాలని 104 జిల్లా మేనేజర్ విలియమ్ చంద్ సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెల్లూరులో 104 వాహనం ద్వారా గురువారం వైద్యసేవలు అందజేశారు. అక్కడికి వచ్చిన ఆయన వాహనం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వాహనం ఎలా నడుస్తోంది.. బాగుందా లేదా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన గ్రామానికి ఉదయం 9 గంటలకే చేరుకుని, ప్రజలకు వైద్యసేవలు అందజేయాలని కోరారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు ధ్రువపత్రాలు



సర్టిఫికెట్ అందిస్తున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి రుక్సానా సుల్తానా బేగమ్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని మొత్తం 32 బాలల సంరక్షణ కేంద్రాలకు ధ్రువపత్రాలు అందజేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి రుక్సానా సుల్తానా బేగమ్ తెలిపారు. నగరంలోని బాలల సంరక్షణ కేంద్రం నిర్వాహకుడికి ఆమె గురువారం ధ్రువపత్రం అందజేశారు. పలు కేంద్రాలు సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వాటిని కమిటీ సభ్యులు పరిశీలించి, ఆమోదించిన వాటికే ఇప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. నిర్వహణకు అనువుగా ఉన్న వాటికి ప్రొవిజినల్ సర్టిఫికెట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీవో సత్యనారాయణ, డీసీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం నిఘా ఉంచాలి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణకు నిరంతరం నిఘా ఉంచాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో గురువారం సమావేశమైన ఆయన.. ఎక్కడైనా చిన్నచిన్న గొడవలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఆ గొడవలు పెద్దవి అవ్వకు ముందే మేల్కొంటే సమస్య త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుంటుందన్నారు. సమస్య తలెత్తినప్పుడు స్పందించకుంటే అది ముదిరి నేరాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లోని రౌడీషీటర్ల కదలికలు గమనించుకుని ఉండాలన్నారు.

జూన్ 3లోగా అడ్మిషన్లు పొందాలి

నెల్లిమర్ల: జిల్లా వ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు జూన్ 3వ తేదీలోగా అడ్మిషన్లు పొందాలని గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇప్పటికే అర్హులైన విద్యార్థులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు నిర్వహించిన ఆర్‌జేసీ సెట్ ఫలితాలు కూడా విడుదల చేశామన్నారు. మరిన్ని వివరాలకు దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

తాగునీటికి కటకట!

- నెల్లిమర్లను వేధిస్తోన్న తాగునీటి సమస్య
- 15 రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- మోటారు పనిచేయకపోవడంతో దుస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం



థామస్‌పేటలో నీటి కోసం తాగునీటి ట్యాంకు వద్ద మహిళల అవస్థలు

నెల్లిమర్ల: నగరపంచాయతీలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. పలు ప్రాంతాల ప్రజలు కొన్నిరోజులుగా తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. గత 15 రోజులుగా ఇదే దుస్థితి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అటు పాలకులు.. ఇటు అధికారులు వారి సమస్య వైపు తలెత్తి కూడా చూడకపోవడంతో బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పట్టదా అని నిలదీస్తున్నారు. ఇందుకేనా ఓట్లు వేసి గెలిపించిందని ప్రజాప్రతినిధులను.. తమను ఇలాగే ఉంచుతారా అని అధికారులను కడిగిపారేస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అప్పట్లో 3 రోజులకోసారి.. ఇప్పుడు అదీ లేదు..

నగరపంచాయతీలోని మొత్తం 20 వార్డుల్లోని ప్రజానీకానికి స్థానికంగా ఉన్న చంపావతి నది నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. దీనికోసం జరజాపుపేటలో ఒకటి, నెల్లిమర్లలో మూడు ఊటబావులు ఉన్నాయి. ఫుట్‌బాల్ గ్రౌండ్ దగ్గరున్న ఊటబావి(నేలబావి) పాడవ్వడంతో గాంధీనగర్ కాలనీ, థామస్‌పేట, సెగిడివీధి, పద్మశాలి వీధి ప్రాంతాల ప్రజలు తాగునీటికి దూరమయ్యారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా వీరికి స్టేట్‌బ్యాంక్ సమీపంలోని నేలబావి నుంచి నీటిని అందించారు. అదే బావిలో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని గత రెండు నెలలుగా మూడు రోజులకోసారి మాత్రమే కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఈ బావి నుంచి నీటిని తోడే మోటారు మరమ్మతులకు గురవ్వడంతో ఆ కాస్తంత నీటి సరఫరా కూడా ఆగిపోయింది. దీంతో దాదాపు రెండు వేల కుటుంబాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు, అధికారులను కలిసి తమ గోడు విన్నవించుకున్నా వినడం లేదని వాపోతున్నారు. ఇలాగైతే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ఇదేనా ప్రజాసంక్షేమం.. ఇదేనా అభివృద్ధి అని మండిపడుతున్నారు.



మోటారు పాడైన స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న నేలబావి ఇదే..



యాత వీధిలో విరిగిపోయిన పైపులైన్ వాల్వ్

మరోచోట వాల్వ్ పాడైంది..

బైరెడ్డి వీధి, జంగాల వీధి, యాత వీధి తదితర ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు సంబంధించి, వాల్వ్ మరమ్మతులకు గురైంది. దీంతో ఆయా ప్రాంతాలకు కూడా తాగునీటి సరఫరా ఆగిపోయింది. వారూ తాగునీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల జరిగిన నగరపంచాయతీ సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగినా ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. కాగా ఎవరికి వారే తప్పించుకుని తిరిగితే తమ సమస్య ఎలా పరిష్కారమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నోబెల్‌నగర్, బియ్యాలపేట, కొత్త ధర్మపురి, కమలానగర్, ధర్మపురి విలేజ్, జీఎస్ఆర్ లేవుట్, ఎస్‌వీఎన్ నగర్, వసంత్‌విహార్, పద్మావతి నగర్, గాయత్రినగర్ ప్రాంతాలకు.. ఉదయం 7:30 నుంచి 10 గంటల వరకు గంజిపేట, పావనినగర్, గణేష్ కోవెల, బాలాజీ మార్కెట్, అంబేడ్కర్ కాలనీ, అరుంధతినగర్, గూడ్స్‌షెడ్ ప్రాంతాలకు.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సంజీవయ్య కాలనీ, కలెక్టరేట్ ఎదురుగా కణపాక యాతపేట, భవానినగర్, కేఎల్ పురం, ఆర్టీవో కార్యాలయం, సాయిలలితా నగర్, సాయికీర్తన నగర్, పద్మావతి నగర్, కోయినగర్, ద్వారపూడి రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు.

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లెండికి ఎన్‌బీఏ టైర్–1 అక్రిడిటేషన్



ఎన్‌బీఏ గుర్తింపునిచ్చిన టైర్–1 పత్రాలను చూపుతున్న లెండి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ రామారెడ్డి తదితరులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ ద్వారా ప్రతిష్టాత్మకమైన టైర్–1 అక్రిడిటేషన్ పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి తెలిపారు. ఈ గుర్తింపు పొందడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ నాణ్యతా విద్యాప్రమాణాలు పాటించిన సంస్థగా ఎదిగిందని వివరించారు. కళాశాల విద్యానైపుణ్యం, పరిశ్రమ ఆధారిత పాఠ్యాంశాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, నాణ్యతాప్రమాణాలు తదితర అనేక అంశాల ఆధారంగా ఎన్‌బీఏ టైర్–1 గుర్తింపు వస్తుందని చెప్పారు. లెండి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ కళాశాల ప్రారంభం నుంచి ఎన్‌బీఏ టైర్ –1 వరకూ ఎదిగిన విధానాన్ని వివరించారు. గుర్తింపు రావడం పట్ల కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు,వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ తమ్మినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలురైతు కార్డులు



భోగాపురం: కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సురేష్

- విజయనగరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు



డెంకాడ: మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణరావు

డెంకాడ: అర్హులందరికీ కౌలురైతు కార్డులు అందిస్తామని విజయనగరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు తెలిపారు. మండలంలో కౌలురైతులను గుర్తించేందుకు మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 320 మంది కౌలురైతులను గుర్తించి కార్డులు అందించామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ వస్తోందని, 340 వరకు కౌలురైతులను గుర్తించి కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌలురైతులంతా ఆధార్‌కార్డు, ఫొటో, యజమాని భూమి తాలూకా 1బి జిరాక్సు తీసుకుని వీఏఏలను సంప్రదించాలని కోరారు. కౌలురైతు కార్డు ఉంటేనే రాయితీపై విత్తనాలు, ఎరువులు అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు(కౌలురైతు కార్డులు) మంజూరు చేస్తామని చీపురుపల్లి సబ్‌డివిజన ఏడీఏ ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీతారామునిపేట సచివాలయంలో కౌలురైతుల గుర్తింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో మండలంలో మొత్తం 318 మంది కౌలురైతులను గుర్తించామని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 340 మంది కౌలురైతులను గుర్తించి కార్డులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

భోగాపురం: కౌలురైతులంతా గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సురేష్ కోరారు. మండలంలోని ముంజేరు, చాకివలస గ్రామాల్లో కౌలురైతు గుర్తింపుకార్డులపై గురువారం అవగాహన కల్పించారు. కౌలుకు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ కౌలు ధ్రువీకరణ పత్రాలు ఎంతో అవసరమన్నారు. కార్డుల కోసం స్థానిక రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 470 మంది రైతులకు కౌలుపత్రాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏవో హరికృష్ణ మాట్లాడుతూ కౌలురైతులంతా భూయజమాని అనుమతితో అధికారులను కలిసి కార్డులు చేసుకోవాలన్నారు.

వాటర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలనలో అధికారుల బృందం

నెల్లిమర్ల: పట్టణంలో సమ్మర్ వాటర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ప్రజారోగ్య, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు గురువారం స్థలం పరిశీలించారు. స్థానిక ప్రధాన వంతెన దగ్గరలో ట్యాంకు ఏర్పాటుకు స్థలం అనుకూలమా కాదా అనేది చూశారు. మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ స్టోరేజ్ నిర్మాణం అవసరంగా తాజా డీఆర్‌సీ సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ మేరకు చంపావతి నదిలో స్థలం పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. పరిశీలనకు వెళ్లిన వారిలో పబ్లిక్ హెల్త్ విభాగం ఈఈ జ్యోతి, డీఈఈ ఈశ్వర్, ఏఈఈ మణికంత, ఇరిగేషన్ డీఈఈ గోవిందరావు, నగరపంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ తదితరులు ఉన్నారు.

యోగాసనాలపై అవగాహన

విజయనగరం అర్బన్: స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) ప్రాంగణంలో యోగాసనాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి పలువురు ఔత్సాహికులు విచ్చేసి యోగా సాధన చేస్తున్నారు. కార్యక్రమంలో యోగా బోధకుడు ఎస్.రవివర్మ, వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

దత్తిరాజేరు: యోగాతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మరడాంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు మాస్టర్ ట్రైనీ చంద్రరావు యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు.

కంపుకొడుతున్న కార్పొరేషన్



విజయనగరం కార్పొరేషన్ కంపు కొడుతోంది. ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త వర్షానికి తడిసి దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక, కూటమి నాయకులు పట్టించుకోక జనావాస ప్రాంతాలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. దోమలకు నిలయాలుగా మారాయి. దీనికి గంటస్తంభం, బొంకుల దిబ్బ తదితర ప్రాంతాల్లో కనిపించిన ఈ దృశ్యాలే సజీవ సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



స్పీడ్ బ్రేకర్లు వేయరూ?



పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. రోడ్డును ఆనుకుని పాఠశాల ఉండడంతో వచ్చినప్పుడు.. వెళ్లినప్పుడు.. భయంతో విద్యార్థులు రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటీవల ఇక్కడ జరిగిన రెండు రోడ్డు ప్రమాద ఘటనల్లో ఇద్దరు గాయపడి ఆస్పత్రి పాలయ్యారన్నారు. ప్రాణాలు పోయే ప్రమాదం జరగకముందే అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–పూసపాటిరేగ

ఉగ్రవాదం..మతోన్మాదం రెండూ దేశానికి ముప్పే..



ఉగ్రవాదం..మతోన్మాదం రెండూ దేశానికి ముప్పేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీ రమణ అన్నారు. పూసపాటిరేగ మండల కేంద్రంలోని శ్రీనివాస కళాశాలలో మతసామరస్యం కాపాడుకుందాం అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన కాసేపు మాట్లాడారు. కేంద్రం 370 ఆర్టికల్ రద్దు చేసినప్పటికీ కశ్మీర్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉగ్రవాదులను అడ్డుకోవడానికి మనదేశ సైన్యం చేసిన పోరాటం గొప్పదన్నారు. అయితే కేంద్రంలోని మోదీ సర్కారు మతోన్మాదానికి తప్ప సైనికుల పోరాటానికి ఇవ్వడం లేదన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి మతమే ప్రధానంగా పాలన జరుగుతోందని విమర్శించారు. లౌకిక దేశంలో మతకల్లోలాలు జరుగుతుండడం దురదృష్టకరమన్నారు. అటు ఉగ్రవాదం నుంచి ఇటు మతోన్మాదం నుంచి మనదేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

–పూసపాటిరేగ

ఆరోగ్య 'యోగ'ం



యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయనగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఏయూ(ఆంధ్ర యూనివర్సిటీ) ప్రొఫెసర్ ఇందుమతి అందరితో యోగాసనాలు వేయించి, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, యోగా వల్ల కలిగే లాభాలు ప్రజలకు తెలిపారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతిఒక్కరూ యోగాపై అవగాహన పెంచుకుని నిండు ఆరోగ్యం పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఆర్‌వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం

రోడ్డుపైనే నీరు..

దారిలేక బేజారు

విజయనగరం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది. ప్రధానంగా రెడ్‌క్రాస్ భవనం, నెహ్రూ యువ కేంద్రం, అగ్రికల్చరల్ కార్యాలయాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. ముడుకులోతు నీటిలో రాకపోకలు సాగించారు. దీనికి ఈ చిత్రాలే నిలువెత్తు సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



కలెక్టరేట్ రోడ్డులో నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు



వర్షపు నీటిలో సైకిలిస్టు





వర్షపు నీటిలో వస్తున్న వాహనచోదకులు, పాదచారులు



రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయానికి వెళ్లే మార్గం ఇలా..